సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



చేపనారు @ బాదంపూడి

బాదంపూడి చేప నారుకు మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సొసైటీలకు సరఫరా చేస్తుంటారు. సీజన్‌లో 6.50 కోట్ల నారును ఉత్పత్తి చేస్తున్నారు. IIలో



ఉండి సొసైటీలో చేతివాటం

ఉండి: ఉండి కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఉద్యోగులు చేతివాటంతో రూ.2 కోట్ల మేరకు నిధులు గోల్‌మాల్ అయ్యాయి. దీనిపై విచారణకు ఆదేశించారు. IIలో

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్

సాక్షి, భీమవరం : జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ నవంబర్ 1 నుంచి 30 వరకూ అమలులో ఉంటుందని ఎస్పీ రవి ప్రకాష్ తెలిపారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, నిర్వహించి రాదన్నారు.



న్యూస్‌రీల్

అంకుర పరిశ్రమలకు నిట్ ఆహ్వానం



తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ విద్యాసంస్థలోని ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నవంబరు 4న స్టార్టప్ 2.0 ఎక్స్‌పో 2024 కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కె.శాస్త్రి సోమవారం తెలిపారు. జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న యువత నుంచి వివిధ రకాల ప్రాజెక్టులకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్‌గా డాక్టర్ సుదర్శన్‌దీప వ్యవహరించనున్నారు. ఆసక్తికల విద్యార్థులు నవంబరు ఒకటిలోగా తమ ప్రాజెక్టులకు సంబంధించి దరఖాస్తులు పంపించాలన్నారు.

కనిపించకుండా పోయిన బాలికలు క్షేమం

తణుకు: ప్రైవేటు తరగతులకు వెళ్తున్నామని చెప్పి కనిపించకుండా పోయిన బాలికలు క్షేమంగా తణుకు చేరుకున్నారు. తణుకు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పదోతరగతి చదువుతున్న నలుగురు బాలికలు ఆదివారం అదృశ్యమైన విషయం తెలిసిందే. స్కూలులో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారని చెప్పి వీరంతా కనిపించకుండా వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్సైలు కె.శ్రీనివాస్, పి.అప్పారావులు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా సిగ్నల్ ట్రేస్ చేశారు. సికింద్రాబాదులో ఉన్నట్లు తేలడంతో అక్కడ జీఆర్‌పీ పోలీసులను అప్రమత్తం చేసి బాలికల ఫొటోలను పంపించారు. అప్రమత్తమైన జీఆర్‌పీ పోలీసులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో బిర్యానీ తింటూ ఉండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణ ఎస్సై పి.అప్పారావు ఆధ్వర్యంలో బృందం సోమవారం సికింద్రాబాదు వెళ్లి బాలికలను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఇద్దరు బాలికలు హైదరాబాదు చూడాలనే ఆశతో మిగిలిన ఇద్దరిని ప్రభావితం చేసి తీసికెళ్లినట్లు తెలుస్తోంది.

ఆర్బీకేలు రైతులకు వరం

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో పెద్దపీట వేశారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, విడుదల రజని, జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ సునీత అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన గోపన్నపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు ప్రారంభించారు. సిబ్బంది రైతులకు, ప్రభుత్వానికి వారధులుగా సేవలందించాలని ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, దుర్గగుడి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి తదితరులు పాల్గొన్నారు.



గోపన్నపాలెంలో జరిగిన సామాజిక సాధికార బహిరంగ సభలో పాల్గొన్న అశేష జనవాహిని

గోపన్నపాలెంలో సామాజిక సాధికార బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో మంత్రులు పినిపే విశ్వరూప్, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, విడదల రజనీ, వేణుగోపాలకృష్ణ, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, వాసుబాబు, ఎలీజా, తలారి వెంకట్రావు, మేకా ప్రతాప అప్పారావు, డీఎన్నార్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, జయమంగళ వెంకటరమణ, పోతుల సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



బడుగు, బలహీన వర్గాలకు..
అగ్రపీఠం

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు చేసిన **మేలును గుర్తుచేస్తూ చేపట్టి**న సామాజిక సాధికార బస్సు యాత్రకు దెందులూరు **నియోజకవర్గంలో జనం నీ**రాజనం పట్టారు. రోడ్డుకిరువైపులా బారులు తీరి అపూర్వ **స్వాగతం పలికారు. అశేష** జనవాహిని పోటెత్తడంతో నాలుగు కిలోమీటర్లు సాగిన ర్యాలీ **ముందుకు సాగేందుకు దాదా**పు గంటన్నరకుపైగా సమయం పట్టింది. మంత్రులు, **ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ**లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బడుగులకు చేసిన **మేలు వివరించగా.. జనం** చప్పట్లతో తమ అభిమానం చాటుకున్నారు.



గోపన్నపాలెంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, చిత్రంలో మంత్రులు కారుమూరి, జోగి రమేష్, విడదల రజనీ తదితరులు

- వైఎస్ జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సాధికారత
- సామాజిక సాధికార బస్సుయాత్రకు పోటెత్తిన జనం
- సోమవరప్పాడు–గోపన్నపాలెం మధ్య యాత్రకు నీరాజనం
- రోడ్డుపొడవునా బారులు తీరిన ప్రజలు
- జనసంద్రంగా మారిన గోపన్నపాలెం

దెందులూరు/ఏలూరు మెట్రో : దెందులూరు మండలం గోపన్నపాలెం జనసంద్రంగా మారింది. ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. వేలాది మంది బైక్‌లపై ర్యాలీగా తరలిరాగా సామాజిక సాధికార బస్సు యాత్ర ముందుకు సాగింది. రోడ్లకు ఇరువైపులా బారులు తీరిన ప్రజలతో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరించారు. అలాగే టీడీపీ, జనసేన కుయుక్తులను తీవ్రస్థాయిలో ఎండగట్టారు.

సోమవారం సోమవరప్పాడు బైపాస్ వద్ద బస్సు యాత్రకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి నేతృత్వంలో పార్టీ ముఖ్యులు ఘన స్వాగతం పలికారు. కేరళ సంప్రదాయ వాద్యాలు, కోలాటాలు బస్సుయాత్రను ఆహ్వానించారు. మరోవైపు జగనన్న కటౌట్‌లతో బైకులపై ర్యాలీలు తీస్తూ బస్సు యాత్ర ముందుగా ప్రదర్శనగా సాగారు. బస్సు యాత్రలో రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, విడుదల రజని, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్‌తో పాటు పెద్ద ఎత్తున దెందులూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

జయహో జగన్ నినాదాలు

వేలాది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలతో సామాజిక సాధికార బస్సు యాత్ర వెంట కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా ముందుకు సాగారు. దెందులూరు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఈ బస్సు యాత్ర జోష్ నింపింది. ద్విచక్రవాహనంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం మహిళలు, చిన్నారుల కోలాటం ప్రత్యేక ఆర్షణగా నిలిచింది. వీరభద్రపురం వద్ద మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, సోమవరప్పాడు సర్పంచ్ సరిగే నాగరాజు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరభద్రపురం మీదుగా వేగవరం వద్ద వైఎస్సార్ విగ్రహానికి సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా మసీదుపాడు క్రాస్, గోపన్నపాలెం మూడు కూడళ్ళ సెంటర్ మీదుగా సభా ప్రాంగణానికి బస్సు యాత్ర చేరింది.

దద్దరిల్లిన గోపన్నపాలెం సభ

గోపన్నపాలెం సభకు జనం పోటెత్తారు. దెందులూరు, పెదపాడు, పెదవేగి మండలాల నుంచి పార్టీ శ్రేణులతో పాటు దెందులూరు మండలం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో గోపన్నపాలెం జనసంద్రంగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున సభ జరగడంతో ప్రధాన రహదారులు జనసంద్రంగా మారిపోయాయి. సభా ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రసంగించారు. అనంతరం మంత్రులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పోతుల సునీత, జయమంగళ వెంకటరమణ, కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, వీఆర్ ఎలీజా, దూలం నాగేశ్వరరావు, మేకా వెంకట ప్రతాప అప్పారావు, టీటీడీ బోర్డు సభ్యులు నెరుసు నాగసత్యం, గంటా ప్రసాదరావు, యడ్ల తాతాజీ, ఏలూరు, దెందులూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



సీఎం జగన్ కటౌట్‌తో అభిమాని



గోపన్నపాలెంలో బస్సు యాత్రలో భాగంగా భారీ బైక్ ర్యాలీ



సామాజిక సాధికార బస్సు యాత్రలో కార్యకర్తల జోష్

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వ్యవస్థలను మేనేజ్ చేశారంటూ సీఎం వైఎస్ జగన్‌పై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు దిట్ట అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా ఏలూరుకు విచ్చేసిన పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం స్థానిక ఎస్‌వీ కల్యాణ మండపంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను అసెంబ్లీలో మాట్లాడనివ్వకుండా మేనేజ్ చేసి, బయట పార్టీలో కూడా ఇతరులను మేనేజ్ చేసి చంద్రబాబు దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. చంద్రబాబుకు బెయిల్ రాకుండా మేనేజ్ చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని, నిర్దోషి అయితే ఎప్పుడో బయటకు వచ్చేవాడని చెప్పారు. స్కిల్ స్కాంలో 13 సంతకాలు చేశాడని స్పష్టమైన ఆధారాలుండబట్టే ఆయనకు వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నాయన్నారు. లోకేష్, భువనేశ్వరి చంద్రబాబు మోసపూరిత విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ప్రజలను, తనను నమ్ముకున్న వారిని మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్‌లకు సంబంధించిన ఒక్క పైసా కూడా వృథా కాకుండా సంక్షేమ ఫలాల రూపంలో అందుతున్నాయని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అనేక పథకాలు అర్హులకు అందకుండా అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు గత ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందా, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మేలు జరిగిందా అనేది ప్రజలు గుర్తించాలన్నారు.

లోకేష్ నుంచే చంద్రబాబుకు ప్రాణహాని

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: చంద్రబాబుకు ఆయన కుమారుడు లోకేష్ నుంచే ప్రాణహాని ఉందని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ.. జైలులో ఉన్న చంద్రబాబును ప్రభుత్వం కంటికిరెప్పలా కాపాడుతోందన్నారు. టీడీపీ – జనసేన పొత్తు వచ్చే ఎన్నికల లోపు ఎన్ని ముక్కలవుతుందోనని చెప్పారు. ఎన్టీఆర్‌కు ఆనాడు చంద్రబాబు వెన్నుపోటు పొడవడాన్ని భువనేశ్వరి సమర్థిస్తారా అని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పిన తర్వాతే భువనేశ్వరి ప్రజల్లోకి రావాలన్నారు. నిజం గెలవాలంటూ భువనేశ్వరి బస్సు యాత్ర చేసినా, లోకేష్ నోటికి వచ్చినట్టు బూతులు మాట్లాడినా, కోడలు బ్రాహ్మణిని పక్కన బొమ్మగా నిలబెట్టి కన్నీరు కార్చినా తెలుగుదేశం పార్టీకి జనం నుంచి సానుభూతి కూడగట్టలేరన్నారు.

ప్రజలు అమాయకులు కాదు

ఆధారాలతో సహా దొరికిపోయిన చంద్రబాబు జైలుకు వెళితే.. అందులో నిజం ఉందని ప్రజలు నమ్మారన్నారు. అందుకే ప్రజల నుంచి స్పందన లేదన్నారు. భువనేశ్వరి నిజం గెలవాలని అనడం మాత్రం న్యాయాన్ని చిన్నచూపు చూస్తున్నట్టుగా ఉందని చెప్పారు. చంద్రబాబు అవినీతికి సంబంధించి ఆధారాలు ఉండబట్టే న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించిందన్నారు. 50 రోజులైనా ఆధారాలు చూపించలేక పోయారని, ప్రభుత్వ సొమ్మును దోచేసుకుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. సహధర్మచారిణిగా చంద్రబాబు తప్పు చేశాడో లేదో భువనేశ్వరికి తెలుసునని, నిజం గెలవాలని ఆమె అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని మంత్రి చెప్పారు. 'కెమెరామెన్ గంగతో రాంబాబు' సినిమాలో మాదిరి లోకేష్ ద్వారానే చంద్రబాబుకు ప్రమాదం పొంచి ఉందని మంత్రి చెప్పారు. జైలులో ఉన్న చంద్రబాబుకు ప్రభుత్వం రోజుకు రెండు మూడు సార్లు వైద్యపరీక్షలు చేయిస్తోందన్నారు. న్యాయమూర్తి రిమాండ్ విధించిన దొంగను బయటకు వదిలేసి రెడ్‌కార్పెట్ వేసి ఆహ్వానించాలా అని ఆయన ప్రశ్నించారు. టీడీపీ, జనసేన రెండు పార్టీలూ ఎవరికి ఎవరు తోక పార్టీలో తేల్చుకోవాలని మంత్రి సూచించారు. జైలులో ఉన్న చంద్రబాబుకు పవన్ సాష్టాంగ నమస్కారం చేసినప్పుడే కాపు జాతి పవన్‌ను అసహ్యించుకుందన్నారు. కాపు జాతిని తాకట్టు పెట్టడానికి జాతి మొత్తం పవన్ కల్యాన్ వెనకాల లేదని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు.

అర్జీలను బాధ్యతతో పరిష్కరించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని బాధ్యతతో పరిశీలించి అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికార్లను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేటు స్పందన సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ధరఖాస్తులను జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డితో కలసి కలెక్టరు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు మళ్లీ రీ ఓపెన్ అవ్వకుండా ఖచ్చితమైన పరిష్కారం చూపాలన్నారు. మండల స్థాయిలో బాధ్యతతో నిర్వహిస్తే జిల్లా స్పందనకు ఎక్కువ ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉండదన్నారు. స్పందనలో 286 అర్జీలు అందాయని తెలిపారు. జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్ రెడ్డి, ఆర్డీవో కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

తాడేపల్లిగూడెం అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక కోడే వెంకట్రావు ప్రభుత్వ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని 27 నుంచి 35 వార్డు ప్రజలకు సోమవారం నిర్వహించారు. వైద్య పరీక్షల నిమిత్తం ప్రజలు వేలాదిగా తరలి వచ్చారు. వైద్య పరీక్షలతో పాటు కేన్సర్ పరీక్షలను జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు నిర్వహించారు. శిబిరం వద్ద నిర్వహించిన సమావేశంలో ఉపముఖ్యమంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే కాంక్షతో ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. జగన్ దేశానికి రోల్‌మోడల్ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. శిబిరాలలో ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా మన శరీరంలో తెలియకుండా ఉన్న వ్యాధులు తెలుసుకొని తగిన మందులు వాడవచ్చన్నారు. ముందస్తు క్యాన్సర్ నిర్ధారణకు అత్యంత ఖరీదైన మోమోగ్రఫీ, పాప్స్మియర్ వంటి పరీక్షలు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. అవసరమైన మందులను ప్రతి నెలా ఇంటివద్దకే అందిస్తున్నామన్నారు. కడకట్ల అర్బన్ హెల్త్ సెంటరు వైద్యులు డాక్టర్ సత్తి అమృత, వైద్యసిబ్బందితోపాటు జీఎస్ఎల్ నుంచి వచ్చిన వైద్య నిపుణులు మొబైల్ యూనిట్లలో సేవలు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ సామ్యూల్, ఆర్‌డీఓ కె.చెన్నయ్య, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, మానికొండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు .



పరీక్షలకు వచ్చిన వారికి సూచనలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పైడిపర్రులో ఆరోగ్య శిబిరంలో సుగర్ పరీక్ష చేయించుకుంటున్న మంత్రి కారుమూరి

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

తణుకు టౌన్: ప్రజల ఆరోగ్యం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలుచేస్తున్నారని.. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం తణుకు పైడిపర్రులోని ఆకుల భీమన్న మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలను ఒక టైంటేబుల్ ప్రకారం అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో రాష్ట్రం అభివృద్ధిలో నడుస్తుందన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రంలో పేదరికం స్థాయి 11 నుంచి 6 శాతానికి తగ్గిపోయిందన్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడానికి ఎంతో మంది కలిసి వస్తున్నారని వారి మోసాలను గుర్తించాలని కోరారు. ఈ శిబిరంలో మంత్రి కారుమూరి సుగర్ పరీక్ష చేయించుకున్నారు. శిబిరంలో ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను సందర్శించి పదార్థాలను రుచి చూశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్ చైర్మన్ ఎం.శివశంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



ఉండ్రు ప్రదీప్ మృతదేహం

తణుకు: బైక్‌పై వెళుతుండగా అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర గాయాలపాలై ఇద్దరు దుర్మరణం చెందాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఉండ్రాజవరం మండలం వెలగదుర్రు గ్రామానికి చెందిన ఉండ్రు ప్రదీప్ (27) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తణుకులో మాలల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు బైక్‌పై వచ్చాడు. అనంతరం తిరిగి వెళుతుండగా జాతీయ రహదారిపై ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన డ్రమ్ములను అదుపుతప్పి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రదీప్ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, భార్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై కె.శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలంపురం వద్ద ఫార్మసీ విద్యార్థిని..

పెంటపాడు: అలంపురం శివారు హైవేపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అచ్చన్నపాలెంకు చెందిన పాతూరి ఉదయ హరిణి (19) పెదతాడేపల్లిలోని వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీఫార్మసీ చదువుతోంది. సోమవారం స్నేహితుడైన హర్షతో కలిసి బైక్‌పై తణుకులో పుట్టినరోజు వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా అలంపురం శివారులో బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో ఉదయహరిణికి తీవ్రగాయాలుకాగా, హర్షకు గాయాలయ్యాయి. వీరిద్దరిని స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో తణుకు ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఉదయహరిణి మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్సై హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేపనారు @ బాదంపూడి

- 4 దశాబ్దాలుగా ఏటా సీజన్‌లో 6.50 కోట్ల చేపనారు ఉత్పత్తి
- గతంలో ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ సరఫరా
- ప్రైవేటు హేచరీలకు దీటుగా బాదంపూడి మత్స్య కేంద్రం

బాదంపూడి చేప నారుకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. నాలుగు దశాబ్దాలుగా రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ బాదంపూడి మత్స్యకేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో మూడు రకాల చేప నారును ఉత్పత్తి చేసి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సొసైటీలకు సరఫరా చేస్తున్నారు. ఏటా సీజన్‌లో 6.50 కోట్ల చేప నారును ఉత్పత్తి చేస్తున్నారు. ప్రైవేటు హేచరీలు అధునాతన టెక్నాలజీతో రకరకాల చేపనారును ఉత్పత్తి చేస్తూ ప్రభుత్వ హేచరీలకు గట్టి పోటీ ఇస్తున్నప్పటికీ బాదంపూడి నారుకు ఏ మాత్రం డిమాండ్ తగ్గకపోవడం విశేషం. రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ప్రభుత్వ మత్స్యకేంద్రంగా బాదంపూడి వెలుగొందుతోంది.



బాదంపూడి మత్స్య కేంద్రంలోని సిమెంట్ కుండీలు, చెరువులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గంలోని బాదంపూడి మత్స్యకేంద్రం నాణ్యమైన చేపనారు ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తోంది. విస్తీర్ణంలో నంద్యాల మత్స్యకేంద్రం పెద్దది కాగా, ఉత్పత్తిలో బాదంపూడి ఖ్యాతిగాంచింది. 14.7 ఎకరాల విస్తీర్ణంలో శాస్త్రీయ పద్ధతిలో ప్రతి సీజన్‌లో కట్ల, రోహూ, మ్రిగాలా తదితర ఇండియన్ మేజర్ సీడ్ (ఐఎంసీ) ఆమోదిత రకాల నారును ఇక్కడ ఉత్పత్తి చేసి ప్రభుత్వ ఆధీనంలోని సొసైటీలు, చెరువులకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. 1978లో ప్రారంభమైన బాదంపూడి మత్స్యకేంద్రానికి గతంలో ప్రైవేటు హేచరీలు ఏర్పాటు ముందు వరకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడి నారు కోసం కొన్ని నెలల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. ఆ సమయంలో ప్రైవేటు హేచరీలకు కూడా ఇక్కడి నుంచే నారును సరఫరా చేసేవారు. అయితే ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో ఫంగస్, రూప్‌చంద్ చేపలకు మార్కెట్ ఉండటంతో ప్రైవేటు హేచరీలు అధికంగా ఆ రకాల నారు ఉత్పత్తిపై దృష్టి నిలిపి వాటికి అనుబంధంగా ఉండే కొత్తరకాలు అభివృద్ధి చేస్తున్నారు. అయితే ఐఎంసీ అధికారిక అనుమతులున్న కట్ల, రోహూ, మ్రిగాలా ఉత్పత్తిపై అవసరమైన మేరకు దృష్టి కేంద్రీకరించలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో బాదంపూడి నారుకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువైంది. అయితే బాదంపూడి నుంచి కేవలం ప్రభుత్వ ఆధీనంలోని సొసైటీలకే సరఫరా చేయాలనే నిబంధనలు ఉండటంతో కేవలం ప్రభుత్వ చెరువులు, సొసైటీల ఆధీనంలో ఉన్న చెరువులకు మాత్రమే నారును సరఫరా చేస్తుంటారు. అంతేకాక ఈ కేంద్రంలో ప్రొడక్షన్, రేర్ రెండూ జరుగుతున్నాయి. దీనికి అనుగుణంగా తణుకు, కొవ్వలి, ఏలూరు, నర్సాపురం, కృష్ణా జిల్లాలోని పెనుమలూరు, మోటూరులోని రేరింగ్ సెంటర్లకు సుమారు మూడున్నర కోట్ల చేప పిల్లలను ఇక్కడి నుంచి సరఫరా చేస్తుంటారు.

బాదంపూడే ఎందుకంటే..

భూసారం, నీటి సౌలభ్యం మెరుగ్గా ఉండటాన్ని ప్రామాణికంగా తీసుకుని మత్స్య కేంద్రం ఏర్పాటుకు బాదంపూడిని ఎంపిక చేశారు. గోదావరి కెనాల్ చెంతనే ఉండటంతో ఈ నీటిని 14.7 ఎకరాల విస్తీర్ణంలోని మత్స్య కేంద్రంలోని చెరువులకు తరలిస్తుంటారు. బాదంపూడిలో ప్రత్యేకత ఏమిటంటే నల్లరేగడి, ఎర్రనేల రెండు కలిసి ఉంటాయి. దీనివల్ల నీరు భూమిలో ఎక్కువగా ఇంకిపోకుండా నీరు చెరువులో ఎక్కువ కాలం ఉంటుంది. దీంతో పాటు ఈ రెండు రకాల నేలలు కలిసి ఉండటంతో చెరువులోనే సహజంగా చేపలకు అవసరమైన పోషక విలువలతో కూడిన నాచు, ఇతర మొక్కలు మొలుస్తాయి. దీంతో పశ్చిమగోదావరి జిల్లా అంతా మత్స్యశాఖాధికారులు సర్వే నిర్వహించి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసి 1978లో ఈ కేంద్రాన్ని నెలకొల్పారు.



బాదంపూడి మత్స్యకేంద్రంలో తల్లి చేపలకు ఇంజెక్షన్ ఇస్తున్న దృశ్యం



తల్లి చేపలను పడుతుండగా పరిశీలిస్తున్న ఏడీఏ నర్సయ్య

డిమాండ్‌కు తగ్గట్టుగా నారు ఉత్పత్తి



మత్స్యకేంద్రంలో డిమాండ్‌కు అనుగుణంగా నారును ఉత్పత్తిని చేస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటికే ఆరున్నర కోట్ల నారు ఉత్పత్తి చేసి ప్రభుత్వ అనుబంధ సొసైటీలకు సరఫరా చేశాం. అధికారిక నారును మాత్రమే ఇక్కడ శాస్త్రీయ పద్ధతుల్లో సిద్ధం చేసి సరఫరా చేస్తున్నాం. – ఎ.నర్సయ్య, మత్స్యశాఖ ఏడీఏ

పెరుగుతున్న ఉత్పత్తి

కరోనాతో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని మళ్లీ గతేడాది నుంచి ఇక్కడ నారు ఉత్పత్తి క్రమేపీ పెరుగుతోంది. ప్రతి ఏటా సగటున 6 నుంచి 7 కోట్ల మేర ఉత్పత్తి జరుగుతుండగా, ఈ ఏడాది ఇప్పటివరకు 6.50 కోట్ల నారు ఉత్పత్తి చేశారు. ఐదు రేరింగ్ సెంటర్లలో మూడున్నర కోట్లు, అలాగే ఏలూరు జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 25 సొసైటీలకు మిగిలినవి సరఫరా చేస్తున్నారు. ఇక్కడ ఆరున్నర కోట్ల చేపనారు, 8 నుంచి 10 మిల్లీమీటర్ల సైజు చేపలు 20 లక్షల వరకు ఉత్పత్తి చేస్తున్నారు.

నారు తయారీ ఇలా..

మగ చేపలను, ఆడ చేపలను కేంద్రంలోని చెరువుల్లో పెంచుతారు. సీజన్ ముందు ఓరోజు సాయంత్రం వీటికి జవాటైడ్, ఓవాసిస్ మందు ఇంజెక్షన్ ఇచ్చి హేచరీలో వదులుతారు. సంయోగం అనంతరం గుడ్లను విడుదల చేస్తాయి. ఈ గుడ్లు హేచరీలోనే 72 గంటలు పాటు వదిలివేస్తారు. తరువాత చిరు నారు బయట పడుతుంది. వీటిని సేకరించి కుండీలలో పెంచుతారు. ప్రధానంగా జూన్ నుంచి జూలై 15 వరకు కట్ల (చేపరకం) జూలై నుంచి సెప్టెంబర్ వరకు, రోహూ ఆగస్టు నుంచి సెప్టెంబర్ వరకు, మ్రిగాలా (చేపరకం) నారును వాతావరణ అనుకూలాన్ని బట్టి సిద్ధం చేస్తుంటారు.

పేకాటలో పట్టుబడ్డ ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సాక్షి, భీమవరం: పట్టణంలోని నర్సయ్యఅగ్రహారంలో పేకాడుతూ పట్టుబడ్డ ఏఆర్ కానిస్టేబుల్ బి.వి జయ్‌కుమార్‌ను ఎస్పీ యు రవిప్రకాష్ సస్పెండ్ చేసినట్లు డీఎస్పీ బండారు శ్రీనాథ్ సోమవారం చెప్పారు. ఆదివారం నర్సయ్యఅగ్రహారంలోని ఇంటిలో పేకాడుతున్నట్లు వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనుకు సమాచారం అందడంతో దాడి చేయగా 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.32,660 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పేకాటలో పట్టుబడ్డ వ్యక్తుల్లో కానిస్టేబుల్ విజయ్‌కుమార్ ఉండడంతో అతన్ని సస్పెండ్ చేశారని డీఎస్పీ వివరించారు.

పంట కాలువలో ఉల్లిపాయల లారీ బోల్తా



పంటకాలువ నుంచి లారీని క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఉల్లిపాయల లోడుతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు పట్టణ పరిధిలోని పంటకాలువలో బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా మైదుకూరు నుంచి తాడేపల్లిగూడెం మార్కెట్‌కు ఉల్లిపాయల లోడుతో లారీ ఆదివారం బయలుదేరింది. అయితే డ్రైవర్‌కు దారి అవగాహన లేకపోవడంతో విజయవాడ నుంచి నరసాపురం బైపాస్‌లో భీమవరం చేరుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున భీమవరం చేరుకున్న లారీ లోసరి – గూట్లపాడు పంట కాలువ వద్ద మలుపు తిరుగుతుండగా కాలువలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీలో వ్యక్తులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. అయితే ఉల్లిపాయల బస్తాలు మొత్తం నీటిలో మునిగిపోయాయి. అయితే బస్తాలు కాలువలో కొట్టుకుపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తరువాత లారీని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

ఉండి సొసైటీలో ఉద్యోగుల చేతివాటం

ఉండి: ఉండి కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో ఉద్యోగులు చేతివాటంతో రూ.2 కోట్ల మేరకు నిధులు గోల్‌మాల్ అయ్యాయి. గత కొన్నేళ్లుగా గట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ అవినీతిపై ప్రస్తుత పాలకవర్గం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన జిల్లా కో–ఆపరేటివ్ అధికారులను విచారణకు ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేపట్టారు. బ్యాంక్‌లో లావాదేవీలపై సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో బ్యాంక్ కార్యదర్శి జీవీ ప్రసాద్, కోలమూరు బ్రాంచ్ మేనేజర్ దుర్గారావు ద్వారా అవినీతి సోమవారం వెలుగు చూసింది. దీనిపై ప్రత్యేక విచారణాధికారిగా జీ సత్యనారాయణను నియమించారు. సోమవారం ఆయన బ్యాంక్‌లో విచారణ ప్రారంభించారు. రూ.2 కోట్ల వరకు బ్యాంకులో అవకతవకలు జరిగినట్లు అనుమానిస్తున్నామని, సోమవారం జరిగిన విచారణలో రూ.63 లక్షల వరకు అవకతవకలు జరిగినట్టుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సత్యనారాయణ చెప్పారు. ఏడుగురు సభ్యులు బ్యాంకులో తీసుకున్న గోల్డ్‌లోన్‌లకు నగదు పూర్తిగా చెల్లించినా వారి ఖాతాలపై రుణాలు తీసుకున్నట్లు గుర్తించామన్నారు. అలాగే సీకేసీసీ లోన్స్‌ను సభ్యుల నుంచి రికవరీ చేసి సంబందిత సొమ్మును బ్యాంకు ఖాతాకు చెల్లించకుండా దుర్వినియోగం చేసినట్లు తేలిందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను అడ్డుపెట్టుకుని సుమారు రూ.8 లక్షలు రుణాలు తీసుకున్నారని, అలాగే బ్యాంక్ నిల్వ సొమ్ములో రూ.11.60 లక్షలు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించామన్నారు. విచారణలో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంపై డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ బ్యాంకులో అవకతవకలు చాలా సంవత్సరాల నుంచి జరుగుతున్నాయని, ప్రస్తుతం అవి వెలుగులోకి వచ్చాయన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టు ఎంపిక

జే పంగులూరు: బాపట్ల జిల్లా జె.పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం కళాశాలలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఖోఖో శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ (శాప్) వీసీ అండ్ ఎండీ ధ్యాన్‌చంద్ ఆర్థిక సహాయంతో నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమానికి శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య పాల్గొన్నారు. శిబిరం పర్యవేక్షకుడిగా కోచ్ డీ లక్ష్మీనారాయణ రెడ్డి, అసిస్టెంట్ కోచ్ బ్రహ్మనాయుడు వ్యవహరించారు.

ఆంధ్రా జట్టు ఎంపిక

ఖోఖో రాష్ట్ర జట్టును సోమవారం ఎంపిక చేశారు. వై.సతీశ్, పీ శివారెడ్డి, కే వంశీ (ప్రకాశం), పీ నరసయ్య (విజయనగరం), ఎం.ఫణికుమార్ (ప్రకాశం), ఏ శివనాగిరెడ్డి, పీ స్వామినాథన్ (భారతీయ రైల్వే), జీ క్రాంతికుమార్ (విశాఖపట్నం), బీ లక్ష్మీనారాయణ (నెల్లూరు), కే రామ్మోహన్ (ప్రకాశం), ఎ.రాజ్‌కుమార్ (చిత్తూరు), వై.దాల్‌నాయుడు (కృష్ణా), ఎల్.అప్పలనాయుడు (పశ్చిమ గోదావరి), కే ప్రవీణ్ (శ్రీకాకుళం)ను ఎంపిక చేశారు.

వేల్పుల కొలువు వేల్పూరు

- గ్రామంలో 260 ఆలయాలు
- నిత్యం భక్తిభావంతో అలలారుతున్న వైనం
- ఏ వీధికి వెళ్లినా కనిపించే ఆలయాలు



తణుకు మండలం వేల్పూరు గ్రామం

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్: ఆ గ్రామంలో ఏ వీధిలో చూసినా ఆలయాలే కనిపిస్తాయి. నిత్యం ఏదోక ప్రాంతంలో జరిగే ఉత్సవాలు, ఊరేగింపులతో గ్రామంలో భక్తి భావం వెల్లివిరుస్తుంది. తణుకు మండలంలోని వేల్పూరు గ్రామం మేజర్ పంచాయతీ. ఇక్కడ సుమారు 25 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామం ప్రత్యేకత ఇక్కడ వెలసిన దేవాలయాలే. అవును.. ఈ గ్రామంలో ఏకంగా 260 ఆలయాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. గ్రామ దేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారు కాగా, క్షేత్రపాలకుడుగా రుద్రేశ్వరస్వామి కొలువయ్యారని పూర్వీకులు చెబుతుంటారు.

పేరులోనే ప్రత్యేకత...

పెద్ద సంఖ్యలో ఆలయాలు కొలువై ఉన్న వేల్పూరు గ్రామానికి పేరులోనే ప్రత్యేకత ఉంది. ఇంతకీ ఆ పేరులో అర్థమేమిటి.. అది ఎలా వచ్చిందంటే.. వేల్పూరు గ్రామ శివారు రేలంగి గ్రామంలో విశ్వామిత్రుడు, జమదగ్ని, వశిష్టుడు మహాయజ్ఞం చేస్తున్న సమయంలో 108 మంది దేవతలు ఉద్భవించారని, రేలంగిలో ఏడుగురు దేవతలు ఉండిపోగా మిగిలిన 101 మంది దేవతలు వేల్పూరులో వెలిశారని పురాణాలు చెబుతున్నాయి. దేవతలు అంటే వేల్పులు కాగా దేవతలు ఉండే ఊరు వేల్పుల ఊరుగా పిలువబడేదని చెబుతున్నారు. కాలక్రమేణా వేల్పుల ఊరు కాస్తా వేల్పూరుగా మారిందని ఇక్కడి వారు పేర్కొంటున్నారు. రానురానూ దేవాలయాలు మరింత పెరగడంతో పాటు ఏడాది పొడవునా ఉత్సవాలు, ఊరేగింపులు, ప్రత్యేక పూజలు జరుగుతుండటం విశేషం.

వినాయక చవితి ప్రత్యేకం...

సాధారణంగా వేల్పూరు పేరు చెప్పగానే టక్కున గుర్తుకు వచ్చేది వినాయకచవితి. గత కొన్నేళ్లుగా వినాయక చవితి పేరుతో ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామంలో 350కి పైగా విగ్రహాలు ఏర్పాటు చేస్తుండటం విశేషం. నిమజ్జనం జరిగే వరకు ప్రతిరోజూ ఒక పండుగలా వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలివస్తుంటారంటే అవి ఏ స్థాయిలో ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలు ప్రత్యేకంగా ఉంటాయి.

సినీ నటులను పోలిన వ్యక్తులు...

ఈ గ్రామానికి ఇంకో ప్రత్యేకత కూడా ఉంది. ప్రఖ్యాత సినీ నటులను పోలిన వ్యక్తులు ఈ గ్రామంలో దాదాపు 10 మంది ఉండేవారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, నాగార్జున, వెంకటేష్.. ఇలా వారి పోలికలతోనే వీరు ఉండటం విశేషం. దీంతో ఆయా నటులను అనుకరిస్తూ వీరితో గ్రామంలో జరిగే పలు ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్స్‌లు కూడా చేయించేవారు. ×కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్‌ౕ పేరుతో తీసిన ఓ చిత్రంలోనూ వీరంతా నటించడం విశేషం. కాలక్రమేణా వారంతా వార్ధక్యంతో చనిపోయారు.

నాలుగు దిక్కుల్లో అమ్మవార్లు...

వేల్పూరు గ్రామంలో ముఖ్యంగా నలుగురు అమ్మవార్లు నలుదిక్కులా వెలసినట్టు పూర్వీకులు చెబుతున్నారు. ప్రధానంగా ఈశ్వరమ్మ, దూమరమ్మ, మారెమ్మ, పోలేరమ్మ అమ్మవార్లు ఇక్కడ వెలసినట్టు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రతి ఏటా ఉగాదికి పుంతలో ముసలమ్మ జాతర, జ్యేష్ట పౌర్ణమికి మహాలక్ష్మి అమ్మవారి జాతర, శివరాత్రికి శివుడి కల్యాణం, కార్తీకమాసంలో లక్షపత్రి పూజ, వైశాఖ మాసంలో వెంకటేశ్వరస్వామి కల్యాణం, గురుపౌర్ణమికి సాయిబాబా ఉత్సవాలు, వీరభద్రుడి కల్యాణం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం జరుగుతుంటాయి. ఏడాదిలో సుమారు 100 రోజుల పాటు గ్రామంలో ఏదోక ప్రాంతంలో అన్న సంతర్పణలు జరుగుతుంటాయి. కనీసం 10 వేల మందికి తక్కువ కాకుండా అన్నసమారాధన చేస్తుంటారు.

పేరెన్నికగన్న శ్రీరమణ నిలయాశ్రమం...

శ్రీరమణ నిలయాశ్రమం ఈ గ్రామానికి మరో ప్రత్యేకత. రమణ మహర్షి శిష్యుడు ఇక్కడ నిత్యం మౌనముద్రలో ధ్యానం చేస్తుంటారు. ఈ ఆశ్రమానికి దేశవిదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తుంటారు. ప్రతి ఏటా కార్తీక మాసంలో అమావాస్య రోజున ఈ ఆశ్రమంలో 50 వేల మందికి అన్నదానం చేస్తుంటారు. ఈ ఆశ్రమంలో ఎలాంటి విరాళాలూ తీసుకోకపోవడం విశేషం. ప్రతిరోజూ గ్రామంలోని మహిళలు అక్కడికి వెళ్లి సేవలు చేస్తుంటారు.

చలివిడి, పానకాల సమర్పణ ఆనవాయితీ...

ఉత్సవాలు, ఇతరత్రా పర్వదినాల్లో గ్రామంలో చలివిడి, పానకాలు సమర్పిస్తుండటం ఇక్కడి ఆనవాయితీ. ఇలా చలివిడి, పానకాలు సమర్పించే సమయంలో గ్రామంలోని దాదాపు అన్ని దేవాలయాలనూ సందర్శించడం ఇక్కడ ప్రత్యేకత. గ్రామంలోని ప్రధాన దేవాలయాలైన వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు శ్రీ రుద్రేశ్వర, వీరభద్ర, మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానాలు దేవదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతుండగా.. మిగిలిన ఆలయాలు స్థానికంగా ఏర్పాటైన కమిటీల ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. గ్రామంలో పెద్ద దేవుడి గుడిగా రుద్రేశ్వర స్వామి దేవాలయాన్ని పిలుస్తుంటారు. గ్రామంలో సుమారు ఏడువేల వరకు కుటుంబాలు ఉండగా 40 ప్రధాన వీధులు ఉన్నాయి. గ్రామంలో కేవలం హిందూ దేవాలయాలే కాకుండా చర్చిలు, మసీదులు కూడా ఉన్నాయి. గ్రామంలో ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయం, పాడి కాగా.. ఇక్కడ ఎక్కువగా రైతువారీ కుటుంబాలు జీవిస్తున్నాయి.



వేల్పూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, మహాలక్ష్మి అమ్మవారి ఆలయం



ప్రసిద్ధి గాంచిన విఘ్నేశ్వర స్వామి ఆలయం



గ్రామంలోని ప్రధాన రోడ్డులో దేవాలయాలు



గ్రామంలోని పుంతలో ముసలమ్మ ఆలయం



గ్రామంలో శ్రీరమణ నిలయాశ్రమం

స్థానికుల విరాళాలతోనే..



గ్రామంలోని పెద్ద దేవుడి గుడిలో ప్రధాన అర్చకునిగా పని చేశాను. మా పూర్వీకుల నుంచి గ్రామంలోనే అర్చకత్వం నిర్వహిస్తున్నాం. గ్రామంలో దాదాపు 260 వరకు హిందూ దేవాలయాలు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా మహాలక్ష్మి, మెంటాలమ్మ, పుంతలో ముసలమ్మ, గోగులమ్మ, గంగమ్మ, ఈశ్వరమ్మ, మారెమ్మ, దూమరమ్మ ఆలయాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని దేవాలయాల్లోనూ స్థానికుల నుంచి సేకరించిన విరాళాలతోనే ధూపదీప నైవేద్యాలు చేస్తున్నారు.
– వెలవలపల్లి త్రిమూర్తులు, పూర్వపు ప్రధాన అర్చకుడు, వేల్పూరు

20 ఏళ్లుగా సేవలు...



వేల్పూరు గ్రామంలోని శ్రీ రమణ నిలయాశ్రమంలో ఇరవయ్యేళ్లుగా సేవలు చేస్తున్నాను. ఆశ్రమంలోనే వ్యవసాయం చేస్తూ కుటుంబంతో సహా నిత్యం సేవలు చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇక్కడకు దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చేవారికి ఉచితంగా ఆశ్రయం కల్పిస్తుంటారు.
– చుండ్రు విశ్వేశ్వరరావు, స్థానికుడు, వేల్పూరు

భక్తి భావం ఎక్కువ...



మా గ్రామంలో ప్రజలకు భక్తి భావం ఎక్కువ. పూర్వం కేవలం 101 దేవాలయాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఏ వీధిలోకి వెళ్లినా దేవాలయాలు ఉంటాయి. ఏడాది పొడవునా గ్రామంలో ఏదోక దేవాలయంలో ఉత్సవాలు జరుగుతుంటాయి. గ్రామానికి వినాయక చవితి పెట్టింది పేరు. వినాయకచవితి వచ్చిందంటే చాలు.. గ్రామం నుంచి వెళ్లి దేశ విదేశాల్లో స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకుంటారు.
– వల్లూరి నారాయణ, స్థానికుడు, వేల్పూరు

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



కొట్టు సత్యనారాయణకు సమస్యలను వివరిస్తున్న కార్మిక సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీడబ్ల్యూసీ గోడౌన్ జట్టు కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హైదరాబాద్‌లో ఉన్న సీడబ్ల్యూసీ గోడౌన్ సంస్థ ప్రాంతీయ మేనేజర్‌ను ఫోన్లో ఆదేశించారు. సోమవారం పట్టణంలో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను కలిసి జట్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. వెంటనే మంత్రి హైదరాబాద్‌లోని ప్రాంతీయ మేనేజర్‌తో కార్మిక కూలీ బకాయిలు రెండు రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. మంత్రికి సమస్యను విన్నవించిన వారిలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, గోడౌన్ జట్టు కార్మిక నాయకులు, కార్మికులు తదితరులు ఉన్నారు.

ప్రజలకు, పట్టాదారులకు సేవలు అందిస్తాం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్.ఐ.సి ఉద్యోగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జీవితబీమా సంస్థలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా సోమవారం సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ నున్న సూర్య శ్రీరామ్ మాట్లాడుతూ ఉద్యోగులచే సంస్థలో ఎటువంటి అవినీతి లేకుండా కార్యకలాపాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ప్రజలకు, పట్టాదారులకు సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీఎస్ శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఎస్.ఆశోక్, మహంకాళి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

వంట సామగ్రి అందజేత



ఇరగవరం జెడ్‌పి హైస్కూల్‌లో జగనన్న వంట సామగ్రి అందజేస్తున్న నాయకులు

ఇరగవరం: మండలంలోని ఇరగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం వంట సామగ్రి పాత్రలను సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్ అందజేశారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో సమూలంగా మార్పులు చేసి నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంగెన రామానాయుడు, ఎస్ఎంసీ చైర్మన్ జక్కంశెట్టి రాంబాబు, ఉప సర్పంచ్ బొక్కా శ్రీను, ప్రధానోపాధ్యాయులు సూర్య నారాయణ, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



వాకర్స్ ఆధ్వర్యంలో పిల్లలకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాకర్స్ ఉద్యమ స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర ఆళ్వార్ దాస్ 94వ జయంతి ఉత్సవాలు సందర్భంగా సోమవారం పట్టణంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్‌చే పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలకు కేవీ చలం అధ్యక్షత వహించారు. లెప్రసి కాలనీలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, లార్డ్ ఆఫ్ లైఫ్ హోంలో పిల్లలకు బిస్కట్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, నరసింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, బాకా వెంకటేశ్వరరావు, కోపల్లె శ్రీనివాస్, డాక్టర్ కంచర్ల తదితరులు హాజరైయారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

సాక్షి, భీమవరం: సాంకేతిక విద్యతో విద్యార్థులు ఉద్యోగం సంపాదించుకోవడమే కాక ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని క్యారీకేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు ఎం.పవన్ కుమార్ వర్మ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ డిజైన్ పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఆర్ అండ్‌డీ డీన్ పీపీ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఔషధం

- జ్వరమే కదా అని వదిలేస్తే ప్రాణాంతకమే
- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అంటున్న వైద్యాధికారులు



పరిమెళ్ల గ్రామంలో శుభ్రతపై అవగాహన కల్పిస్తూ రోడ్లు శుభ్రం చేస్తున్న సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు



చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెంటపాడు: ప్రతికూల వాతావరణంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దోమల వల్ల అధికంగా వస్తున్నాయి. దీంతో జ్వరాలు అధికంగా నమోదవుతున్నాయి. పారిశుద్ధ్య చర్యలు పటిష్టంగా పాటించమే ఈ సమస్యకు మొదటి పరిష్కారమని వైద్యులు చెబుతున్నారు. ఎండ కాస్తునే వర్షాలు కురవడంతో ప్రజలు రోగగ్రస్తులు అవుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటు ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిట లాడుతున్నాయి. మండలంలో పెంటపాడు, ముదునూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. గతంలో కంటే ఓపీ సేవలు భారీగా పెరిగినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల అవగాహన కోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. పలు గ్రామాల్లో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, వలంటీర్లు, ఆశాల సాయంతో ఫీవర్ సర్వే చేస్తున్నారు. దీంతో పాటు, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

వేగంగా వైద్యసేవలు



జలుబు, దగ్గు, జ్వరం వచ్చే రోగాలకు వేగంగా వైద్యసేవలు అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి ఒక్కరికీ రక్తపూతలు సేకరిస్తున్నాం. అవసరమైతే సెలైన్ పెట్టి రెండు మూడు రోజులు ఆసుపత్రిలో ఉంచి వైద్యం చేస్తున్నాం. రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నాం.

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు వైద్యాధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే...

వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఆహారం తీసుకొనే ముందు, మల విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. మంచాలకు, ఇంటి గుమ్మాలకు దోమలమెస్‌లు వేసుకోవాలి. ఇంట్లో చిన్నారులు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.

'పరీక్ష పే చర్చ' పై ప్రధాన మంత్రి ప్రశంస



ప్రధాని ప్రశంసా పత్రాన్ని అందుకున్న దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నాగశైలజ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రధానమంత్రి 'పరీక్ష పే చర్చ కార్యక్రమం'లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గిద్దా లక్ష్మీనాగశైలజ ప్రతిభ కనబర్చడంతో ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ప్రశంసా పత్రం లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమంలో దండగర్ర హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మానసిక ఒత్తిడికి లోనవ్వకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రధానమంత్రి దేశ వ్యాప్తంగా విద్యార్థులకు తెలియజేసారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శైలజను హెచ్‌ఎం చంద్రశేఖర్ అభినందించారు.

ప్రజలకు ఉచిత వైద్యం సీఎం ఘనత



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి సంపత్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: వేలాది రూపాయలు వెచ్చించే వైద్యాన్ని ఉచితంగా ప్రజలకు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ స్వతహాగా వైద్యుడు కావడం పట్ల పేదల వైద్యంపై శ్రద్ధ వహించి, ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో ముందడుగు వేసి, పేదల ముంగిటకే వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఉన్నత వైద్యం, అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు జరుగుతున్న గ్రామాల్లో కొత్తూరు ఒకటని, 18 ఏళ్లు నిండిన యువతులకు మాత్రమే వివాహాలు చేయాలన్నారు. లేకుంటే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. అనంతరం వైద్యులు శ్రీహర్ష, ఏవీ.వెంకటేష్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ విజిటలర్ సీవీఎస్.మణి, ఎంఎల్‌హెచ్‌పీ మద్దుకూరి ఆశాలతో పాటు దివ్య జ్యోతి, జి.కృపాజాకబ్, ఆశా కార్యకర్తలు ఎస్.కనకదుర్గ, వై.వెంకటలక్ష్మి, ఆర్.రామసీత, గంగా,ఎస్.చంద్రకాంత్, ఎం.నాగమణి, ఏఎన్ఎం జి.రాజేశ్వరి, రామజ్యోతి, కే.విజయశాంతి, ఫార్మాసిస్ట్ అప్పన్న, హెల్త్ అసిస్టెంట్ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ లబ్ధిదారులకు సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వీలుకాని వైద్యచికిత్సలు అవసరమైన వారు తనను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని చెప్పారు. సీఎం సహాయ నిధితో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జగనన్న ఆరోగ్య శిబిరం వద్ద సుమారు రూ.10 లక్షలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణిబును చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు



లక్కీ డ్రా విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, డిపో మేనేజరు గిరిధరకుమార్

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో అమలవుతున్న కార్గో డోర్ డెలివరీ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం కార్గో మాసోత్సవాల్లో భాగంగా డోర్ డెలివరీ సేవలపై నిర్వహించిన లక్కీ డ్రాను ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ చేతుల మీదుగా తీశారు. ఈ సందర్భంగా తణుకుకు చెందిన నరేష్ క్లాత్ షోరూం సౌజన్యంతో సమకూర్చిన బహుమతులను విజేతలకు అందచేశారు. డిపో మేనేజరు సప్పా గిరిధరకుమార్ మాట్లాడుతూ మాసోత్సవాల్లో భాగంగా ప్రతి సోమవారం లక్కీ డ్రా తీసి మూడు చీరలను విజేతలకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డ్రాలో విజేతలైన గుమ్మంపాడుకు చెందిన కె.వెంకట్‌కు మొదటి బహుమతి, తణుకుకు చెందిన ఆల్బమ్ నానికి రెండో బహుమతి, అజ్జరం గ్రామానికి చెందిన ఎం.నాగేశ్వరరావుకు మూడవ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, గ్యారేజ్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొమ్మేటి విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న శెట్టిబలిజ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్

అత్తిలి: శెట్టిబలిజ సంఘం పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్యరాజేంద్రప్రసాద్ చెప్పారు. సోమవారం సాయంత్రం అత్తిలి షాదీఖానాలో జరిగిన మండల శెట్టిబలిజ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అత్తిలి కెనాల్‌రోడ్డులో నవంబరు 5న దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని, ఈకార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గుబ్బల తమ్మయ్య, వేండ్ర వెంకటస్వామి పాల్గొంటారని చెప్పారు. విగ్రహావిష్కరణ సందర్భంగా కె సముద్రపుగట్టు గ్రామం నుంచి భారీ బైక్‌ర్యాలీ ప్రారంభమౌతుందని తెలిపారు. మండలంలోగల శెట్టిబలిజ సంఘ సభ్యులంతా ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చలో అత్తిలి కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కుడిపూడి చంద్రరావు, పిల్లి సూరిబాబు, కట్టా అయ్యప్ప, బొంతు శ్రీనివాస్, పెచ్చెట్టి రామకృష్ణ, బొంతుదానయ్య, కముజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

1 నుంచి గూడెంలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన

పెంటపాడు: నవంబర్ 1 నుంచి గూడెంలో క్రైస్తవ పుస్తక ప్రదర్శన శాల నిర్వహించనున్నట్లు బ్యూటిఫుల్ బుక్స్‌సంస్థ ఒక ప్రకటనలో తెలిపారు. గూడెం రైల్వేస్టేషన్ సమీపంలోని రైస్‌మిల్లర్స్‌హాలులో నిర్వహించబోయే ఈ పదర్శనశాలలో క్రైస్తవ ఆధ్యాత్మిక అభివృద్ధికి సహాయకరంగా ఉండేలా పలు భాషలు, ప్రతులలో బైబిల్ గ్రంధాలు, క్రైస్తవ రచనలు, భక్తుల జీవితచరిత్రలు, చిన్నారులు, యవ్వనులకు సంబంధించి ఆధ్యాత్మిక పుస్తకాలు, బైబిల్ కవర్లు, స్టిక్కర్లు ప్రత్యేక తగ్గింపు ధరలకు లభిస్తాయన్నారు. 1 నుంచి 7 తేదీవరకు నిర్వహించబోయే ఈ ప్రదర్శన శాలను క్రైస్తవులు తప్పక వినియోగించుకోవాలని కోరారు.

సహిత క్లబ్ సేవలు ఆదర్శప్రాయం



సహిత క్లబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేసిన సహిత క్లబ్ ఆదర్శప్రాయమని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. కేంద్రంలో సోమవారం సహిత క్లబ్‌ను నిర్వహించారు. సుబ్బారావుపేట ప్రాథమకి పాఠశాల హెచ్ఎం బి.జ్యోతి మాట్లాడుతూ దివ్యాంగులను సామాన్యమైన పిల్లలతో మమేకం చేయడం ద్వారా దివ్యాంగుల పిల్లలలో సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయని, తల్లిదండ్రులు దివ్యాంగుల పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం దివ్యాంగుల విద్యార్థులచే ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రత్యేక ఉపాధ్యాయుని ఎం.చంద్ర కుమారి, కె.కుమారి, సత్యవతి, నాగలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి శివ లింగాల ఊరేగింపు



పట్టణంలో కోటిలింగాలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): శివశక్తి కోటిలింగాల వారి ఆధ్వర్యంలో శివ సంకల్పమస్తు కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం నవరత్నాల టీం సభ్యులచే కోటి శివ లింగాలను తయారు చేసి, సోమవారం స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీ సువర్ణేశ్వరస్వామి ఆలయం నుంచి పోలీస్ ఐలాండ్ వరకు, విజయవాడ టీ సెంటర్ మీదుగా కొబ్బరితోటలో నుంచి సాయి బాబా గుడి వరకు భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి సత్యనారాయణ, ప్రసాద్, డాక్టర్ ప్రణీత, టీం సభ్యులు ఎం.పద్మావతి, ఎం.రాజరాజేశ్వరి, పి.ఝాన్సీరాణి, పద్మజ, కళ్యాణి, సరస్వతి, కీర్తి, సౌమ్య, దీపిక, ఫణి, కన్య, భాగ్యలక్ష్మి, వేదశ్రీ, భవాని, పద్మ, బిందు, లక్ష్మి, సత్య, ఇందిరా పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఒక గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కిందపడి మరణించినట్టు గూడెం రైల్వే ఎస్‌ఐ జి.శ్రీహరిబాబు తెలిపారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఓవర్‌బ్రిడ్జి దాటిన తర్వాత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి సమీపంలో మృతిచెందినట్లు గుర్తించారు. విజయవాడ వైపునకు వెళ్లే రైలు ఢీకొనడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. మృతుని శరీరంపై కాకీ కలర్ షర్టు, బిస్కెట్ కలర్ మాసిన ప్యాంటు ఉందన్నారు. గుర్తు పట్టలేనట్టుగా తయారైన ఈ వ్యక్తి మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామన్నారు. వివరాలు తెలిస్తే ఫోన్ నంబరు 94906 17090 నంబరుకు చేయాలన్నారు.ఈ సంఘటనపై ఎస్సై హరిబాబు కేసు నమోదు చేశారు.

హెచ్‌ఎంకు స్పందన ఈదా ట్రెండ్ అవార్డు



ఏలూరులో ఎమ్మెల్సీ, డీఈవో చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న గోపాల కృష్ణ ప్రసాద్

తణుకు టౌన్: విద్యా రంగంలో విశేష సేవలందించిన ఉపాధ్యాయులకు అందించే స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రెండ్ అవార్డును తణుకు మండలం వెంకట్రాయపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్‌కు వరించింది. ఆదివారం ఏలూరులోని అతిథిగా ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ షేక్ సాబ్జి, జిల్లా విద్యా శాఖాదికారి పీ శ్యామ్‌సుందర్, స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శామ్యూల్‌రెడ్డిల చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. వినూత్న రీతిలో విద్యార్థులకు సులువుగా అర్థం చేసుకొనే రీతిలో విద్యా బోధన చేయడంలో గోపాల కృష్ణ ప్రసాద్ నూతన పద్ధతిలో విద్యా బోదన చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు హెచ్‌ఎంను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు గూడెంలో కపర్థీ శత జయంతి సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికోద్యమ నిర్మాత, అదర్శ కమ్యూనిస్టు, అమరజీవి ఎం.వి.ఎస్.కపర్దీ శత జయంతి సభ అక్టోబర్ 31వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు సుబ్బారావుపేట డీఎస్ చెరువు వద్ద నున్న బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు డి.సోమసుందర్, కార్యదర్శి ఓసూరి వీర్రాజులు వెల్లడించారు. ఈ జయంతి సభకు ఏపీ సాంస్కృతిక, కళా పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షత వహిస్తారని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఆచంట శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాధరాజు ముఖ్య అతిథులుగా, డీవీవీఎస్ వర్మ తదితరులు హాజరవుతారని తెలిపారు.

వృద్ధాశ్రమ నిర్మాణానికి విరాళం

సాక్షి, భీమవరం: ఏలూరు జిల్లా ఉంగుటూరులో నిర్మించే వృద్ధులు, అనాధ పిల్లల ఆశ్రమం నిర్మాణానికి అప్పుస్మా తరపున భీమవరం ఆదిత్య స్కూల్ నుంచి రూ.2 లక్షలు విరాళంగా అందించినట్లు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు సోమవారం చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఆనంద నిలయం భవన నిర్మాణానికి స్కూల్ విద్యార్థులు సేకరించిన మొత్తంతో పాటు మేనేజ్‌మెంట్ కలిపి రూ.2 లక్షల నగదును ఆనంద నిలయం కార్యదర్శి సాగిరాజు జానకీరామరాజుకు అందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కేవీ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

హెన్రీ డొనేట్ వర్ధంతి

భీమవరం: రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డొనేట్ వర్ధంతిని సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. జిల్లా చైర్మన్ శివరామ బద్రిరాజు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రక్తం ఆవశ్యకత, రెడ్ క్రాస్ సేవలను కొనియాడారు. సంస్థ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీకృష్ణారావు మాట్లాడుతూ విపత్తుల సమయంలో రెడ్ క్రాస్ అందించే సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శీలం మల్లేశ్వర, అమూల్యరావు, డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ వీరయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శిరీష పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి



జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సాక్షి, భీమవరం: ఆకివీడులో ముఠా కార్మికులపై దాడి చేసిన రౌడీ మూకలపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యాన సోమవారం జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్‌కు బాధిత కుటుంబసభ్యులతో కలిసి నాయకులు వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన ఆకివీడులో అమాయక హమాలీ కార్మికులపై నేర చరిత్ర కలిగిన రౌడీలు అన్యాయంగా దాడి చేయగా ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, డి.రవితేజ, బి.రాంబాబు, ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో ర్యాలీ

ఆకివీడు: ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడిన ముఠా కార్మికుల కుటుంబాలకు రక్షణ కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కార్మికులకు మద్దతుగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అయిభీమవరం టర్నింగ్ వద్ద నుంచి గుమ్ములూరు సెంటర్ వరకు కొనసాగింది. యూనియన్ నాయకులు కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, ఎం.సత్యం, అచ్చయ్య, రమణ, బి.అప్పలనాయుడు, నెల్లి సూరిబాబు, పి.రమణ, ప్రజా సంఘాల నాయకులు రవితేజ, బీవీ వర్మ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు ఎన్నికల ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సోమవారం ఎలక్షన్స్, రీ సర్వే మ్యూటేషన్స్, స్వమిత్వ, జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు, స్థల సేకరణ, స్పందన గ్రీవెన్స్, తదితర అంశాలపై మండలాల వారీగా సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు. మండలాల్లో పొలిటికల్ పార్టీలు సమావేశం నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వారిగా డూప్లికేట్, షిఫ్టింగ్, జంక్, మరణించిన ఓటర్లు, కొత్త ఓటర్లు నమోదు వంటి అంశాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలు, విధి విధానాలను పూర్తిగా తెలుసుకుని స్పష్టమైన అవగాహనతో సేవలు అందించాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌లో 90 రోజులలో ఇంటి స్థలం దరఖాస్తు, మ్యూటేషన్స్‌పై ఎక్కువ ఫిర్యాదులు వచ్చినవే వస్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. అడ్మిషన్ పూర్తయిన ఇంటర్ విద్యార్థుల డేటాను స్టూడెంట్ ఇన్ఫోలో ఇంకా అప్‌డేట్ చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, డీఎల్‌డీఓ కేసిహెచ్ అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, డీపీఓ జీవీకే మల్లికార్జునరావు, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ రన్నర్స్‌గా విష్ణు విద్యార్థులు

సాక్షి, భీమవరం: జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ పురుషుల టోర్నీలో భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారని ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం చెప్పారు. ఈనెల 28, 29 తేదీల్లో మైలవరంలోని లక్కిరెడ్డి బాల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు రన్నర్స్‌గా విజయం సాధించారని తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.

సాగు కుదేలు

సాక్షి, భీమవరం: దేశ వ్యాప్తంగా వరి, ఆక్వాతో సహా అన్ని పంటలు పండించే రైతుల ఇబ్బందులతో సాగు కుదేలు అవుతోందని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు వై.కేశవరావు అన్నారు. భీమవరంలో సోమవారం ఆక్వా, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో మంతెన సీతారాం, జుత్తిగ నర్సింహమూర్తి పాల్గొన్నారు.



విశిష్ట గాయని రావు బాలసరస్వతీదేవి వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్న సందర్భంగా...

గాన సరస్వతి

పువ్వుకు రాగం అబ్బితే ఎలా ఉంటుంది?
ఆ పువ్వు స్వరాన్ని ఎలా సవరించుకుంటుంది?
ఆ తావి గానాన్ని ఎలా శ్రుతి చేసుకుంటుంది?
అక్షరాలను పూలరెక్కల్లా పొదివి పట్టుకుంటుంది.
సరిగమలు కందకుండా సున్నితంగా గానం చేస్తుంది.
ఆ గాన సరస్వతి... మన రావు బాలసరస్వతీదేవి.

పువ్వు పాడితే ఎలా ఉంటుందో... రావు బాల సరస్వతీదేవి పాట వింటే తెలుస్తుంది. హైదరాబాద్, మణికొండలోని గాయత్రి ప్లాజాలో ఆమె ఫ్లాట్ గోడలు ఆ గానసరస్వతి రాగాలను నిత్యం వింటుంటాయి. తొంభై ఐదేళ్ల వయసులో కూడా ఆమె స్వరంలో రాగం శ్రుతి తప్ప లేదు. తొంభై ఏళ్లుగా సాగుతున్న సాధనతో ఆ స్వరం అద్దుకున్న తియ్యదనం అది. పారిజాత పువ్వులాంటి మృదుత్వం ఆమె రాగానిది. ఆ గొంతు సన్నజాజి మొగ్గలా పరిమళం వెదజల్లుతోందిప్పటికీ. ఆ సుమధుర గానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. తొమ్మిది దశాబ్దాల ఆమె సంగీత సేవను గౌరవిస్తోంది. నవంబర్ ఒకటవ తేదీన (రేపు) ఆమె వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.



● పాట రికార్డింగ్ సమయంలో ఆరేళ్ల బాల సరస్వతీదేవి

గ్రామఫోన్ నుంచి సీడీల వరకు

సరస్వతి నాలుగవ ఏట నుంచి వేదికల మీద పాడుతున్నారు. ఆరవ ఏట హెచ్.ఎం.వి కంపెనీ ఆమె పాటను గ్రామఫోన్‌లో రికార్డు చేసింది. తెలుగు సినిమాలో తొలి నేపథ్య గాయనిగా రికార్డు ఆమెదే. ఆకాశవాణి కేంద్రాలు మద్రాసు, విజయవాడ స్టేషన్ల కోసం ప్రారంభగీతం పాడిన రికార్డు కూడా ఆమెదే. తెలుగు, తమిళ, కన్నడ భాషలతోపాటు సింహళ గీతాలనూ ఆలపించారు. బాలనటిగా, బాల గాయనిగా సినీరంగం ఆమెను గారం చేసింది. పేరు ముందు 'బాల'ను చేర్చింది. కర్ణాటక సంగీతం, హిందుస్థానీ సంగీతాలు సాధన చేసింది. సినిమా షూటింగ్‌ల కారణంగా స్కూలుకెళ్లడం కుదరకపోవడంతో ఆమె చదువు కోసం ట్యూటర్ ఇంటికి వచ్చి పాఠాలు చెప్పేవారు. ఆమెకు ఇంగ్లిష్ నవలలు చాలా ఇష్టం. ఆ అలవాటును ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. గ్రామఫోన్ రికార్డుల కాలం నుంచి క్యాసెట్ టేప్‌లో రికార్డ్ చేసే టెక్నాలజీని చూశారు. సీడీలు, ఎంపీత్రీలనూ చూశారు. టెక్నాలజీతోపాటు అప్‌డేట్ అవుతూ వచ్చారు. కానీ, సినిమా సంగీతం, సాహిత్యంలో వచ్చిన భాషాపరంగా విలోమమవుతున్న ప్రమాణాలను అంగీకరించలేకపోయారు. సినిమా అంటే శక్తిమంతమైన వినోదసాధనం. పిల్లలు, యువతకు మానసిక వికాసం, మేధో వికాసంతోపాటు వాళ్ల అభివృద్ధికి... వినోదం అనే సాధనంతో బాటలు వేసే గొప్ప కళామాధ్యమంగా ఉండాలి సినిమా. అంతే తప్ప విలువలను దిగజార్చుకునే సాధనం కాకూడదని చెబుతారామె. రెండు వేలకు పైగా పాటలు పాడిన ఈ సంగీత సరస్వతి ఈ రోజుల్లో పాటల సాహిత్యం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

సినిమాలకు మాత్రమే దూరం... స్వరానికి కాదు!

పెళ్లి తర్వాత పదిహేనేళ్లకు బాల సరస్వతీదేవి సినిమాల కోసం పాడడం మానేశారు. కానీ సంగీత సాధన మాత్రం ఆపలేదు. సినారె తెలుగులోకి అనువదించిన మీరాభజన్ గీతాలను ఆలపించారామె. ఎనభై ఏళ్ల వయసులో ఆమె తనకిష్టమైన కొన్ని లలిత గీతాలను ఎంచుకుని స్వీయ సంగీత దర్శకత్వం వహించి 'రాధా మాధవం' సీడీ విడుదల చేశారు. కోవిడ్‌కి ముందు 2018లో అంటే ఆమె తొంబయ్యేళ్ల వయసులో 'స్వరాభిషేకం' కార్యక్రమంలో పాడడమే ఆమె చివరి వేదిక. ఆ వేడుక తర్వాత మూడవ రోజు ఇంట్లో జరిగిన ప్రమాదం ఆమెను ఇంటికే పరిమితం చేసింది. అయితే ఆశ్చర్యంగా జారి పడడంతో విరిగిన తుంటి ఎముక దానంతట అదే సరయింది. సంగీతమే తనను స్వస్థత పరిచిందంటారామె. ఇప్పటికీ రోజూ ఆ స్వరం రాగాలను పలుకుతుంటుంది. ఆమె ఊపిరితిత్తులకు శక్తినిస్తున్నది సంగీతమేనని వైద్యులు కూడా నిర్ధారించారు.



● భర్త, పిల్లలతో బాలసరస్వతీ దేవి

పాట కలిపింది ఇద్దరినీ!

చెన్నై (మద్రాసు) లో పుట్టి పెరిగిన బాల సరస్వతి పెళ్లి తర్వాత కోడలిగా కోలంక జమీందారీలో అడుగుపెట్టారు. ప్రకృతి ఇద్దరు వ్యక్తులను దూరం చేసిన విషాదాంతాలను సినిమాల్లో చూస్తుంటాం. కానీ ప్రకృతి ఇద్దరు మనుషులను దగ్గర చేయాలనుకుంటే చాలా చమత్కారంగా దగ్గర చేస్తుంది. అందుకు ఈ గానసరస్వతి పెళ్లే గొప్ప ఉదాహరణ. "నా పాటను వినడానికి స్వయంగా కోలంక జమీందార్... శ్రీ రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు గారు మద్రాసులో మా ఇంటికి వచ్చారు. నేనప్పుడే 'కలువ రేకుల కనులు గల నా స్వామీ' అనే పాట రికార్డింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాను. మా నాన్న పాట పాడమనగానే అదే పాట పాడాను. రాజా వారేమో తన పెద్ద కళ్లను వర్ణిస్తూ, వారి మీద ప్రేమను అలా పాట రూపంలో వ్యక్తం చేశాననుకున్నారట. అదే మా పెళ్లికి నాందీ గీతం' అంటూ ఆనాటి జ్ఞాపకాన్ని సంతోషంగా గుర్తు చేసుకున్నారామె. అందుకే తనకు ఇష్టమైన ప్రదేశం మద్రాసేనని చెబుతారామె.

ఈ బాల రెండో బాల్యమిది!

బాలసరస్వతీ దేవికి హాఫ్ వైట్ పట్టు చీరలిష్టం. క్రీమ్ కలర్‌తో అనేక రంగుల కాంబినేషన్‌లలోనే ఎక్కువగా కనిపిస్తారు. ఆమెకు మల్లెపూలన్నా ఇష్టమే. ఇక స్వీట్స్... ముఖ్యంగా గులాబ్ జామూన్, జాంగ్రీలను చూస్తే చిన్న పిల్లయిపోతారు. చాక్లెట్ చేతికిస్తే పసి పిల్లల ముఖం వికసించినట్లే ఆమె ముఖంలో నవ్వులు పూస్తాయి. భోజనం గుప్పెడే కానీ, ఆ వెంటనే స్వీట్ తినడం ఆమె కిష్టం, ఆ తర్వాత తియ్యగా పాడడం మరింత ఇష్టం. ఆ సరిగమల వారసత్వం ఇద్దరు కొడుకులకు రాలేదు, మనుమడు, మనుమరాలికీ రాలేదు. కానీ మనుమరాలి కూతురు నేహకు వచ్చింది. గానసరస్వతి కళ్ల ముందే ఆ ఇంట్లో సరిగమల కొత్తతరం వెల్లివిరుస్తోంది. తొంభై ఐదేళ్ల వయసులో హైదరాబాద్‌లోని పెద్ద కుమారుని ఇంటిలో ప్రశాంతంగా పసిబిడ్డలా జీవిస్తున్నారు బాల సరస్వతీదేవి. కన్నతల్లిని 'కన్నక్కా' అని పిలుస్తూ తల్లిని కన్నబిడ్డలా చూసుకుంటున్నారాయన. కోడలు అత్తగారి చిన్నప్పటి జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసుకుంటూ ఆమెను అపురూపంగా చూసుకుంటున్నారు. సాక్షి ఇంటర్వ్యూలో ఆమె కొన్ని సంగతులు చెప్తూ మధ్యలో మర్చిపోతుంటే ఆమె పెద్ద కొడుకు, పెద్ద కోడలు అందుకుని పూర్తి చేయడమే అందుకు నిదర్శనం.

– **వాకా మంజులారెడ్డి,**
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: **మోహనాచారి**

మల్టీ టాలెంట్



● బిజినెస్ లీడర్‌గా...

తేజో చంద్రిక



● సుమధుర గాయనిగా...

ఆరోజు...
'అలాగే' అని తల ఆడించి ఉంటే 'పవర్ ఫుల్ ఉమన్'గా ప్రపంచ వ్యాప్తంగా చంద్రిక పేరు తెచ్చుకునేది కాదు.
'ఉద్రిక్త పరిస్థితులు ఉన్న ఈ ఊళ్లో ఒక్కరోజు కూడా ఉండలేను' అని భయపడి ఉండే ఉద్యోగజీవితంలోకి వచ్చేది కాదు. తనను తాను నిరూపించుకునేది కాదు.
'లాయర్ కావాలనుకున్నాను. ఈ ఉద్యోగం ఏమిటి' అని నిట్టూర్చి ఉంటే చంద్రిక కొత్త శిఖరాలు అధిరోహించేది కాదు.
'ఉద్యోగ జీవితానికే టైమ్ లేదు. ఇక సంగీతానికి స్థానం ఎక్కడ' అని సర్దుకుపోయి ఉంటే సంగీత ప్రపంచంలో తనదైన పేరు తెచ్చుకునేది కాదు. ప్రపంచ గుర్తింపు పొందిన బిజినెస్ లీడర్, గ్రామీ–నామినేట్ ఆర్టిస్ట్‌గా, దాతగా ఎంతోమందికి స్ఫూర్తి ఇస్తుంది చంద్రిక....

'అవసరం లేదు' ఒక మాటలో తేల్చేసింది అమ్మ. మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో డిగ్రీలో చేరాలనుకుంటున్న చంద్రికకు ఆ మాట శరాఘాతం అయింది. 'ఆ కాలేజీలో తక్కువమంది మాత్రమే అమ్మాయిలు ఉన్నారు. అంతా అబ్బాయిలే' అన్నది అమ్మ. చంద్రిక చాలా సేపు అమ్మతో వాదించినా ఫలితం కనిపించలేదు.

ఇంట్లోనే నిరాహార దీక్ష చేసింది. దీంతో చంద్రిక మద్రాస్ క్రిస్టియన్ కాలేజీలో చదవడానికి తల్లి ఒప్పుకోక తప్పింది కాదు. మూడు సంవత్సరాల కాలేజీ జీవితం చంద్రిక జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. సంగీతప్రపంచంతో అనుబంధానికి, సింగర్‌గా పేరు తెచ్చుకోవడానికి కారణం అయింది.

డిగ్రీలో చేరడమే కష్టం అనుకున్న చంద్రిక ఆ తరువాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ చేరడం పెద్ద విజయం. నిజానికి చంద్రికకు బిజినెస్ ప్రపంచంపై పెద్దగా ఆసక్తి లేదు. తాతలాగే లాయర్ కావాలనుకుంది. అయితే ప్రొఫెసర్ స్వామినాథన్ సూచన మేరకు బిజినెస్ స్కూల్‌లో చేరింది. మొదటి కొన్నిరోజులు చాలా కష్టంగా అనిపించింది. ఎందుకంటే సొంత ఊరు దాటి అంత దూరం రావడం అదే మొదటిసారి.

ఆ ఒంటరితనానికి దూరం కావడానికి సంగీతానికి దగ్గరైంది. చంద్రిక తొలి ఉద్యోగం సిటీబ్యాంక్‌లో. బ్యాంకర్ కావాలని కలలో కూడా అనుకోని చంద్రికకు ఇది వింతగా అనిపించింది. ట్రైనింగ్ ప్రోగ్రామ్ కోసం లెబనాన్‌లోని బీరుట్ వెళ్లింది. యుద్ధానికి సంబంధించి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో అక్కడకు వెళ్లింది. అక్కడ అయిదు నెలల పాటు ఉంది. సిటీబ్యాంక్ తరువాత వేరే సంస్థల నుంచి చంద్రికకు అవకాశాలు రావడం మొదలైంది. అలా అమెరికాలోకి అడుగు పెట్టింది. ఉద్యోగంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ తనకు ఇష్టమైన సంగీతప్రపంచాన్ని మాత్రం చంద్రిక విడిచి బయటికి రాలేదు. ఎన్నో ఆల్బమ్స్ ద్వారా సక్సెస్‌ఫుల్ మ్యూజిషియన్‌గా తనను తాను నిరూపించుకుంది. సెకండ్ ఆల్బమ్ 'సోల్ కాల్' గ్రామీ అవార్డ్–బెస్ట్ కాంటెంపరరీ వరల్డ్ మ్యూజిక్ ఆల్బమ్ విభాగంలో నామినేట్ అయింది.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ మకెంజీకి ఫస్ట్ ఇండియన్ ఉమెన్ పార్ట్‌నర్‌గా అరుదైన ఘనత సాధించింది. అడ్వైజరీ సంస్థ 'టాండస్ క్యాపిటల్స్ అసోసియేషన్స్' ప్రారంభించి సూపర్ సక్సెస్ అయింది.

ఈ ప్రయాణంలో చంద్రికకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కుటుంబజీవితం, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోవడం కూడా అందులో ఒకటి. అయితే ప్రతి సవాలును అధిగమిస్తూ ముందుకు వెళ్లింది. సవాలు ముందుకు వచ్చినా, ఒత్తిడి తలలో దూరినా తన దగ్గర ఉన్న బ్రహ్మాస్త్రం సంగీతం. పాటలు వినడం, పాడడం తనకు ఎంతో ఇష్టం. అదే తన బలం. తాజాగా 'అమ్మూస్ ట్రెజరర్స్' ఆల్బమ్‌తో ముందుకు వచ్చింది చంద్రిక. ఇది పిల్లలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఆల్బమ్.

సాగుబడి
స్వాతి కార్తె: నవంబర్ 6 వరకు

- బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పెంపకంతో రైతులకు ఆదాయం, పర్యావరణానికి మేలు
- సేంద్రియ వ్యర్థాలను ప్రొటీన్లతో కూడిన ఆహారంగా మార్చుతున్న బ్లాక్ సోల్జర్ ఈగలు
- బిఎస్ఎఫ్ లార్వాలు (పిల్ల పురుగులు) కోళ్లకు, చేపలు, రొయ్యలకు, పెంపుడు కుక్కలకు భేషైన పౌష్టికాహారం
- 30 రోజులకో బ్యాచ్ చొప్పున బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ఇంటిపట్టునే సులువుగా పెంచవచ్చు
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకంలో ఉప ఉత్పత్తిగా వెలువడే సేంద్రియ ఎరువుతో అదనపు ఆదాయం
- దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో ఐసిఎఆర్ ఎన్ఎహెచ్ఇపి ప్రాజెక్టు ద్వారా పైలెట్ యూనిట్ ఏర్పాటు
- శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు శిక్షణ ఇవ్వనున్న పిజెటిఎస్ఎయు

బ్లాక్ సోల్జర్ ఈగలతో ప్రొటీన్ల సేద్యం!




సేంద్రియ వ్యర్థాలను ఆహారంగా తిని పెరిగే బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగు(లార్వా)లు కోళ్లతో పాటు చేపలు, రొయ్యలకు మంచి ప్రొటీన్లతో కూడిన మేతగా ఉపయోగపడుతున్నాయి. విదేశాల్లో విస్తారంగా జరుగుతున్న బిఎస్ఎఫ్ లార్వా సాగు ఇప్పుడిప్పుడే మన దేశంలోనూ వ్యాపిస్తోంది. కుళ్లిన పండ్లు, కూరగాయలు, వంటింట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలను తిని ఈ పిల్ల పురుగులు దాదాపు నెల రోజుల్లోనే పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. బిఎస్ఎఫ్‌పై పరిశోధనలు మన దేశంలో శైశవ దశలో ఉన్నాయి. ఐసిఎఆర్ గ్రాంటుతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఎస్ఎయు) ఏడాది క్రితమే వేస్ట్2వెల్త్ ప్రాజెక్టులో భాగంగా దీనిపై పరిశోధనలు చేపట్టింది. అంతేకాదు, శాస్త్రవేత్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతుల శిక్షణకు ఇటీవలే శ్రీకారం చుట్టింది. ఇన్నోవేటివ్ ఇన్‌సెక్ట్ ఫార్మింగ్ వివరాలతో ఆసక్తికర కథనం...

ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన శాకాహార, మాంసాహారోత్పత్తుల్లో 60% మాత్రమే వినియోగమవుతోంది. పొలంలో 8%, మార్కెట్‌కు వెళ్లే దారిలో 14%, రిటైల్ అమ్మకందారుల వద్ద 7%, ఇళ్లలో వినియోగానికి ముందు 11% మేరకు ఆహారం వృథా అవుతోంది. 2021 యుఎన్ఇపి ఫుడ్ వేస్ట్ ఇండెక్స్ ప్రకారం మన దేశంలో ఏటా 6.88 కోట్ల టన్నుల ఆహార వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఈ సేంద్రియ వ్యర్థాలను చెత్తకుప్పల్లో వేసే కంటే పునర్వినియోగించి ప్రయోజనం పొందటం తెలివైన పని. ఈ పనిని ఇతర పురుగుల కన్నా బ్లాక్ సోల్జర్ ఈగలు (బిఎస్ఎఫ్) సమర్థవంతంగా చేయగలవన్నది నిపుణుల మాట.

పురుగుల సేద్యం చాలా వినూత్నమైనది, పర్యావరణ హితమైనది, ఆదాయాన్ని అందించేది కూడా. మన దేశంలో కొందరు వ్యాపారవేత్తలు, కోళ్ల రైతులు బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పిల్ల పురుగుల(లార్వా)ను సాగు చేయటం ఇటీవల ప్రారంభించారు. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల ఉత్పత్తి కాలం వాటికి వేసే ఆహారాన్ని బట్టి మారుతుంది. ఒక బ్యాచ్ 20 రోజుల నుంచి 40 రోజుల వరకు పడుతుంది. ఆహారం మెత్తగా, త్వరగా జీర్ణించుకునే విధంగా ఉండి ప్రొటీన్లతో కూడి ఉన్నప్పుడు తక్కువ రోజుల్లోనే పురుగులు పెరుగుతాయి.

లేయర్ కోళ్ల ఫారాల్లో ఇనుప కేజ్‌ల కింద పోగుపడే కోళ్ల పెంటపై బిఎస్ఎఫ్ ఈగల 5 రోజుల పిల్లలను వదిలితే చాలు.. ఆ వ్యర్థాలనే ఆహారంగా తింటూ 25–30 రోజుల్లోనే పిల్ల పురుగులు వృద్ధి చెందుతాయి.

బిఎస్ఎఫ్ పెంపకం ద్వారా సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లో 70–80% మేరకు కుదించవచ్చు. అందువల్లనే నగరాలు, పట్టణాల్లో పోగుపడే సేంద్రియ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఇవి ఉపయోగపడుతున్నాయని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) చెబుతోంది. బిఎస్ఎఫ్ లార్వా(పిల్ల పురుగులు) బరువులో 40–45% వరకు ప్రొటీన్లు ఉన్నాయి. అందువల్ల కోళ్ల మేతలో, ఆక్వా మేతల తయారీలో సోయా చిక్కుళ్లు, ఫిష్ మీల్‌తో పాటుగా 10 శాతం వరకు బిఎస్ఎఫ్ పురుగుల పొడిని కలుపుతున్నారు. బతికి ఉన్న పిల్ల పురుగుల (వెట్ లార్వా)ను కోళ్లకు నేరుగా మేతగా వేస్తున్నారు. రోజువారీ మేతలో పది శాతం వరకు ఈ పిల్ల పురుగులను అందిస్తూ సత్ఫలితాలు పొందుతున్న కోళ్ల ఫారాలు తెలుగు నాట ఇప్పటికే అనేకం ఉన్నాయి.



● బ్లాక్ సోల్జర్ ఫ్లై గుడ్లు



● 5 రోజుల వయసులో పిల్ల పురుగులు



● గ్రాములో 3 వేల పిల్ల పురుగులు



● కూరగాయ వ్యర్థాలు, చద్దన్నం, గోధుమ తవుడు మిశ్రమం



● ఆ మిశ్రమమే పురుగులకు ఆహారం



● 15–25 రోజుల్లో లార్వా సిద్ధం. ప్యూపా దశకు ముందే ఈ పురుగులను వాడుకోవాలి

పిజెటిఎస్ఎయులో పైలెట్ ప్రాజెక్టు

అయితే, మన దేశంలో దీనిపై పరిశోధనలు ఇంకా శైశవ దశలోనే ఉన్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పిజెటిఎస్ఎయు) ఈ దిశగా ముందడుగు వేసింది. దేశంలోనే మొట్టమొదటిగా బిఎస్ఎఫ్ పెంపకంపై పరిశోధన చేపట్టింది. నేషనల్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 'వేస్ట్2వెల్త్' ప్రాజెక్టును మంజూరు పిజెటిఎస్ఎయుకు గత ఏడాది చేసింది. పిజెటిఎస్ఎయు పీజీ స్టడీస్ డీన్, కీటక శాస్త్ర ఆచార్యులు డా. వి. అనిత ఈ ప్రాజెక్టుకు నోడల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆవరణలో బ్లాక్ సోల్జర్ ఫ్లైల పెంపకం కమ్ శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు. కూరగాయలు, పండ్ల వ్యర్థాలు, మెస్‌లో మిగిలిన అన్నం, గోధుమ తవుడు మిశ్రమంతో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులు పెంచుతున్నారు. పరిశోధక విద్యార్థులు పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, కృషి విజ్ఞాన కేంద్రాల్లోని శాస్త్రవేత్తల మొదటి బ్యాచ్‌కు డా. అనిత ఇటీవలే శిక్షణ ఇచ్చారు. ఎంటర్‌ప్రెన్యూర్లు, రైతులకు కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు డా. అనిత 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. నగరాలు, పట్టణాల్లో వెలువడే సేంద్రియ ఆహార వ్యర్థాల కాలుష్యాన్ని తగ్గించడానికి, పనిలో పనిగా మంచి ప్రొటీన్‌ను అందుబాటులోకి తెచ్చుకోవడానికి బిఎస్ఎఫ్ లార్వాల పెంపకం ఉపయోగకరం. అన్నిటికీ మించి, సేంద్రియ వ్యర్థాల పరిమాణాన్ని 15–25 రోజుల్లోనే 70–80% మేరకు తగ్గించేంత ఆబగా తినగల శక్తి బిఎస్ఎఫ్ జాతికి వుంది. బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి మన దేశపు వాతావరణం చాలా అనువైనదంటున్నారు డా.అనిత.



● బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను వర్టికల్ టవర్‌లో ట్రేలలో పెంచవచ్చని చెబుతున్న డా. వి. అనిత

ఎంటర్‌ప్రెన్యూర్లకు, రైతులకు శిక్షణ ఇస్తున్నాం

బ్లాక్ సోల్జర్ ఈగలు మనకు కొత్తవి కావు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 20వ శతాబ్దం నుంచి ఉన్నదే ఈ జాతి. కొత్త తెగుళ్లు వ్యాప్తి చెందుతాయన్న భయం లేదు. ఆహార వ్యర్థాలు, పశువుల విసర్జితాలను సాధ్యమైనంత మెత్తగా చేసి, సులభంగా జీర్ణించుకునేలా మార్చి ఈ పురుగులకు వేయాలి. అందులో ప్రొటీన్లు ఉండాలి. చిన్న పిల్లల ఆహారం లాగా ఉండాలి. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను సేకరించి, మెత్తగా రుబ్బి.. దానితో పాటు మెస్‌లో మిగిలిపోయిన అన్నం, గోధుమ తవుడు కొంచెం కలిపి మా ప్రయోగశాలలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను పెంచుతున్నాం. వాటికి వేసే ఆహారాన్ని బట్టి, దానిలో పోషక విలువలను బట్టి, వాతావరణంలో వేడి, గాలిలో తేమను బట్టి.. అవి ఎన్ని రోజుల్లో, ఎంత బరువు పెరుగుతాయన్న విషయం ఆధారపడి ఉంటుంది. సేంద్రియ వ్యర్థాలను సమర్థవంతంగా నాణ్యమైన సేంద్రియ ఎరువుగా మార్చుకునే మార్గం ఇది. పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. మంచి ఆదాయమూ సమకూరుతుంది. రైతులకు, ఎంటర్‌ప్రెన్యూర్లకు శిక్షణ ఇస్తున్నాం.

– **డా. వి. అనిత,** కీటక శాస్త్ర ఆచార్యులు, పీజీ స్టడీస్ డీన్, బ్లాక్ సోల్జర్ ఫ్లై ప్రాజెక్టు నోడల్ ఆఫీసర్, పిజెటిఎస్ఎయు, హైదరాబాద్. మొబైల్: 94402 58050

బిఎస్ఎఫ్ ప్రత్యేకతలు

సేంద్రియ వ్యర్థాలను తినే అనేక జీవులుండగా బ్లాక్ సోల్జర్ ఫ్లైలనే ఎందుకు ఎంపిక చేసినట్లు? ఇదే ప్రశ్న డా. అనితను అడిగితే ఇలా బదులిచ్చారు...

- రోజుకు తన బరువుకు రెట్టింపు సేంద్రియ వ్యర్థాలను తిని, సేంద్రియ ఎరువును విసర్జించగల శక్తి బిఎస్ఎఫ్ పిల్ల పురుగులకు ఉంది. దీని అర్థం ఏమిటంటే.. చెత్త కుప్పలకు తరలివెళ్లే సేంద్రియ వ్యర్థాలు తగ్గిపోతాయి. మిథేన్ ఉద్గారాలు ఆ మేరకు తగ్గుతాయి.
- కుళ్లిన పండ్లు/కూరగాయలు,హోటళ్లు/ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలతో పాటు పశువుల పేడ, కోళ్లు, మేకలు, పందుల విసర్జితాలు వంటి సేంద్రియ వ్యర్థాలను బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకానికి వాడొచ్చు.
- బిఎస్ఎఫ్ జీవిత చక్రం మొత్తం 42–55 రోజులు. గుడ్లు పెట్టిన 4–5 రోజులకు పిగులుతాయి. అవి 15–25 రోజుల్లో పిల్ల పురుగులా(లార్వా)గా ఎదుగుతాయి. ఈ దశలోనే వాటిని సేకరించి కోళ్లు, ఆక్వా మేతల్లో వాడుతున్నారు. అలాగే ఉంచితే, ప్యూపాగా రూపాంతరం చెంది, 17 రోజుల తర్వాత బ్లాక్ సోల్జర్ ఈగలు పుడతాయి. మగ ఈగ 4 రోజుల్లో ఆడ ఈగను కలిసిన తర్వాత చనిపోతుంది. ఆడ ఈగ 5–8 రోజుల్లో గుడ్లు పెట్టి చనిపోతుంది.
- గుడ్లను సేకరించి, అతి చిన్న పురుగులను తయారు చేయుట కొంచెం క్లిష్టమైన ప్రక్రియ. 5 రోజుల పిల్లలకు తగిన సేంద్రియ ఆహారం అందిస్తే 15–25 రోజుల్లో పిల్ల పురుగులు(లార్వా)గా పెరుగుతాయి. ఆ దశలో చక్కని ప్రొటీన్లతో కూడిన ఆ పిల్ల పురుగులు కోళ్లు, చేపలు, రొయ్యలకు మేతగా వాడుకోవచ్చు.
- 5 రోజుల పిల్లలను కొనుక్కొని రైతులు 15–25 రోజుల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను లార్వా దశకు పెంచి, కోళ్లకు, చేపలు, రొయ్యలకు మేతగా వేసుకోవచ్చు లేదా కొనుగోలుదారులకు అమ్ముకోవచ్చు. స్వయం ఉపాధిగా యువకులు బిఎస్ఎఫ్ లార్వా సాగు చేపట్టవచ్చు. ఈ లార్వాను దాణా తయారీ కంపెనీలు, సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. లార్వా దశ దాటి ప్యూపా దశకు పెరిగితే దాణాల్లో వాడకానికి పనికిరాదు.
- సోయా చిక్కుళ్ల సాగులో సమస్యలు, సముద్రాల్లో చేపల సంతతి తగ్గిపోతుండటం వల్ల కోళ్లు, ఆక్వా మేతలతో పాటు, పెంపకపు కుక్కల మేతల్లో కూడా బిఎస్ఎఫ్ పిల్ల పురుగులను ప్రొటీన్ సప్లిమెంట్‌గా ప్రపంచవ్యాప్తంగా వాడుతున్నారు. దీంతో బిఎస్ఎఫ్ లార్వా సాగుకు డిమాండ్ పెరుగుతోంది.
- ఈ పిల్ల పురుగులే అధిక నాణ్యత గల ప్రొటీన్లతో కూడిన దాణాకు ముడి పదార్థం. కోళ్లు, చేపలు, రొయ్యలు, పందులు, పెంపుడు కుక్కలకు వేసే మేతలో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని కలపవచ్చు. పిల్ల పురుగుల బరువులో 40–45% ప్రొటీన్‌తో పాటు ఎసెన్షియల్ అమినో యాసిడ్లు ఉంటాయి. సాధారణంగా మేతల్లో ప్రొటీన్లుగా వాడే సోయా చిక్కుడు గింజలు, ఫిష్‌మీల్‌ను కొంత తగ్గించి దీన్ని వాడుతున్నారు.
- కోళ్లకు రోజువారీ మేతలో పది శాతం మేరకు దీన్ని వాడుతున్నారు. పిల్ల పురుగులను బతికి ఉన్నప్పుడే ఫారం కోళ్లకు మేపవచ్చు. నాటు కోళ్లకూ ఇది మంచి ఆహారం.
- బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పెంపకం క్రమంలో వెలువడే విసర్జితాలే(ఫ్రాస్) పంటలకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువుగా పనికి వస్తుంది. వర్మీకంపోస్టు, పశువుల ఎరువుల్లో కంటే అధిక పోషక విలువలు ఇందులో ఉంటాయని చెబుతున్నారు.
- విదేశాల్లో బిఎస్ఎఫ్ పిల్ల పురుగుల పొడిని బర్గర్లు, షేక్‌లలో కలుపుతున్నారు. దీని నుంచి వెలికితీసే నూనెను బయో ఇంధనంగా వాహనాలు, జనరేటర్లలో వాడుతున్నారు. బిఎస్ఎఫ్ లార్వా నుంచి వెలువడే పొలుసులు(కూటిన్) బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్లాస్టిక్ తయారీకి వాడుతున్నారు. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలున్నందున వైద్య అవసరాలకు కూడా వినియోగిస్తున్నారు.
- వర్షాకాలంలో దీపం చుట్టూ చేరే ఉసుళ్లను వేపుకొని శనగపప్పుతో కలుపుకొని తినే అలవాటు మన దేశంలోనూ ఉంది. బిఎస్ఎఫ్‌తో పాటు మిడతలు, మీల్ వార్మ్స్, గొల్లభామలు, వంటి 1,900 జాతుల పురుగులను 113 దేశాల్లో 200 కోట్ల మంది తింటున్నారని ఎఫ్ఎఓ చెబుతోంది.

పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్